## క్లుప్తంగా

### 22,23న తాగునీటి సరఫరాలో అంతరాయం

నర్సాపూర్: చక్రియాల్‌లో పైపులైన్‌కు మరమ్మతుల కారణంతో ఈనెల 22, 23 తేదీల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా ఉండదని ఆ పథకం డీఈఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చక్రియాల్ వద్ద మెయిన్ పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడడంతో మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు వారు చెప్పారు. నర్సాపూర్, శివ్వంపేట, వెల్దుర్తి, కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్, మాసాయిపేట మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని హత్నూర, గుమ్మడిదల్ల, జిన్నారం మండలాల్లోని అన్ని గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోతుందని వివరించారు. ఈనెల 22, 23 తేదీల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా నిలిచిపోతున్నందున స్థానికంగా ఉండే బోర్ల నుంచి నీటి సరఫరా చేయాలని వారు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులను కోరారు.

### స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ



అందజేసిన స్పోర్ట్స్ మెటీరియల్‌తో క్రీడాకారులు

నర్సాపూర్: క్రీడలతో శారీరక ధారుడ్యం, మానసిక ప్రశాంతత సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు అనిల్‌కుమార్ అన్నారు. స్పోర్ట్స్ కిట్స్‌ను అనిల్ పంపగా, పట్టణానికి చెందిన ఆయన సోదరుడు నర్సింగ్‌రావు వాటిని క్రీడాకారులకు ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం దాతను అభినందించారు.

### రక్తదాన శిబిరంలో పాల్గొనండి : ఎస్‌ఐ రాజేశ్

టేక్మాల్(మెదక్): పోలీసుల అమరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ రాజేశ్ ఆదివారం తెలిపారు. రక్తదాన శిబిరంలో యువకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రక్తదానం చేసే యువకులు ముందస్తుగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పోలీసుల అమరుల దినోత్సవాల్లో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### పశువుల అపహరణకు యత్నం



పాడిగేదెల చోరీయత్నాన్ని వివరిస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి పశువుల అపహరణకు విఫలయత్నం చేశారు. గ్రామానికి చెందిన రైతు బొడ్డు నర్సింలు శివ్వంపేట – ఎదుల్లాపూర్ ప్రధాన రోడ్డు పక్కన తన వ్యవసాయ పొలంలో పాడిగేదెలను కట్టేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు పాడిగేదెలకు కట్టేసిన తాళ్లను తొలగించి, వాటిని దొంగలించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో మనుషుల శబ్దం రావడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తికి సంబంధించి సెల్‌ఫోన్ అక్కడ పడిపోయింది. సదరు రైతు ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా.. రెండు పాడిగేదెల తలుగు తొలగించి ఉండడం, సెల్‌ఫోన్ పడిపోయి ఉన్న విషయం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నారు. కొంత కాలంగా పలుచోట్ల పశువుల చోరీలు జరుగుతుండడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా బీరువాలోని దుస్తులు, వస్తువులు

శివ్వంపేట(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్ శనివారం ఇంటికి తాళం వేసి ఊరెళ్లాడు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉన్న విషయం గుర్తించిన పక్కింటి వారు శంకర్‌గౌడ్‌కి సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసేసరికి బీరువాలోని అర్ధ తులం బంగారం, 25 తులాల వెండి వస్తువులు, నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# రైతులను మోసం చేసిన కాంగ్రెస్

బీఆర్‌ఎస్ నాయకులు జిల్లా వ్యాప్తంగా ఆదివారం ధర్నా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతు భరోసా నిధులు విడుదల చేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులు డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీలిచ్చి రైతులకు రైతుభరోసా ఇవ్వకపోవడంతో పాటూ రైతురుణమాఫీలో మోసం చేసిందని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



తూప్రాన్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



చిన్నశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సబిత



రేగోడ్(మెదక్): సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు



టేక్మాల్‌లో రోడ్డుపై నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

# రైతు ఆగ్రహానికి బలికాక తప్పదు

మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

పాపన్నపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి బలి కాక తప్పదని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైతు భరోసాపై మాట మార్చిన సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు దిష్టి బొమ్మలను పాపన్నపేటలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు భరోసాకు ఇవ్వాల్సిన రూ.20 వేల కోట్లను ఇవ్వకుండా, వాటిని రుణ మాఫీ వైపు మళ్లించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సోములు, జగన్, బాలాగౌడ్, వెంకటేశం, బాబాగౌడ్, కిష్టాగౌడ్, ఆంటోని, మల్లేశంతో పాటు 200 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



పాపన్నపేటలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

పాపన్నపేట(మెదక్): హిందూ దేవాలయంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని బజరంగ్ దళ్ మండలాధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం బజరంగ్‌దళ్ విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంపై దాడి చేసిన దుండగులను అరెస్ట్ చేయనందుకు నిరసనగా హిందువులు శాంతి యుతంగా ధర్నా చేస్తుంటే, పోలీసులు వారిపై లాఠీ ఛార్జి చేయడం తగదన్నారు. పోలీసులు ఈ పక్షపాత ధోరణి మాని, దుండగులను ఉరి తీసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశం, గోపాల్, ఉదయ్, ప్రేంసాగర్, శివ, కార్తీక్, శ్రావణ్, మాధవ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బజరంగ్ దళ్, వీహెచ్‌పీ నాయకులు

# క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): క్రీడల్లో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు భవనగారి శ్రీనివాస్ క్రికెట్ పోటీలు నిర్వహించగా, ఆదివారం విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు, యువకులు నచ్చిన క్రీడల్లో రాణించాలని ఈ సందర్భంగా వారు అన్నారు. మొదటి విజేత జట్టుకు 17,500, ద్వితీయ జట్టుకు 10,000 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతారావు, మురళి, రాజు, తదితరులు ఉన్నారు.

# కోదండ రాముడికి బంగారు ధనుస్సు



ధనుస్సుకు పూజలు చేస్తున్న భక్తులు



శోభాయాత్రలో భక్తులు

శోభాయాత్ర నిర్వహించిన భక్తులు

రామాయంపేట(మెదక్): అయోధ్య భాగ్యనగర సీతారామ సేవా సమితి వారి ఆధ్వర్యంలో కోదండరాముడి కోసం బంగారు ధనుస్సు చేయించారు. ఆదివారం పట్టణంలోని మహంకాళి ఆలయంలో ధనుస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరాముడి భజన కీర్తనలతో శోభాయాత్ర నిర్వహించి, కోదండ రామస్వామి ఆలయానికి దాన్ని తీసుకెళ్లారు. కేజీ బంగారం, 40 కిలోల వెండితో ఈధనుస్సును తయారు చేయించామని సేవాసమితి ప్రతినిధి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. వచ్చే సంవత్సరం అయోధ్యలో ఈ ధనుస్సును తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాబు(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం మాసాయిపేటలో ఈనెల 16న రాత్రి మాసాయిపేటలో రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. బాబును చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### రేకుల ఇల్లు దగ్ధం

పాపన్నపేట(మెదక్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ రేకుల ఇల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోదండం సాయిలు బుడగజంగం కాలనీలో రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకున్నాయి. బయటకు పొగ వ్యాపించడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేశారు. అప్పటికే ఇంట్లో బీరువాలో ఉన్న డబ్బులు, బంగారం, వెండి వస్తువులు, నిత్యావసర సరుకులు, వస్తువులు మంటల్లో కాలిపోయాయి. సుమారు రూ.4లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

### సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని కొంతన్‌పల్లికి చెందిన భిక్షపతి చికిత్స నిమిత్తం ఆదివారం రూ.రెండు లక్షల యాభై వేల ఎల్‌ఓసీ బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి అందజేశారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వెంకట్‌రామిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూఢ నమ్మకాలను నమ్మొద్దు

ఎస్‌ఐ శివానందం

తూప్రాన్: మూఢ నమ్మకాలను నమ్మి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ శివానందం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కిష్టాపూర్‌లో గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓ కుటుంబంపై మంత్రాల నెపంతో దాడులు చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామస్తులకు కౌన్సెలింగ్ చేశామన్నారు. ప్రపంచం ఎంతో అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో ఇంకా గ్రామాల్లో మూఢ నమ్మకాలను నమ్మి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. వ్యక్తిగత కక్ష్యలకు, మంత్రాలను జతచేసి దాడులు చేసుకోవడం వల్ల అనవసరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఫలితంగా కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోవాల్సి ఉంటుందన్నారు. గ్రామంలో అందరు సోదర భవంతో కలిసి మెలిసి ఉండాలని తెలిపారు.



కిష్టాపూర్‌లో గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

నర్సాపూర్: ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలం చెందడంతో ఆ పార్టీ నాయకులు, ప్రజలు బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని కోణంపేటకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు రైతులను నిండా ముంచిందని ఆరోపించారు. కార్యక్రమంలో కోణంపేట బీఆర్‌ఎస్ నాయకులు బాలేష్, అర్జున్‌లతో పాటు పార్టీ నాయకులు చంద్రాగౌడ్, నయీమొద్దీన్, సత్యంగౌడ్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే సునీతారెడ్డి

# గుట్టుచప్పుడు కాకుండా ఇందిరమ్మ కమిటీలు

అల్లాదుర్గం(మెదక్): నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ కమిటీలను నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇళ్లు లేని వారికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసేందుకు కమిటీ తీర్మానిస్తే ఇవ్వాల్సి ఉంది. అయితే అధికారులు ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా, గుట్టుచప్పుడు కాకుండా అల్లాదుర్గం మండలంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చెప్పిన పేర్లతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నారని సొంత పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలాధ్యక్షుడు గ్రామాల్లో గ్రూపులు సృష్టిస్తూ, తనకు అనుకులంగా ఉన్న వారికి మాత్రమే ఇందిరమ్మ కమిటీలను ఎంపిక చేస్తున్నట్లు చిల్వెర గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆదివారం నిర్వహించిన సమావేశంలో మండి పడ్డారు. సీనియర్ నాయకులకు తెలియకుండా తమ గ్రామంలో ఇందిరమ్మ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయంపై మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఫిర్యాదు చేస్తామన్నారు. మండలంలో ఇందిరమ్మ కమిటీలతో కాంగ్రెస్‌లో గ్రూపులు తగదాలు చోటు చేసుకుంటున్నాయని పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం సేవలు చేసిన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు లేదన్నారు.



చిల్వెరలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తలు

# ఓపెన్ జిమ్ ప్రారంభం

నిజాంపేట(మెదక్): అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్ అసోషియేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో దాతల సాయంతో తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్ అసోషియేషన్ నూతనంగా ఓపెన్ జిమ్‌కు అవసరమైన పరికరాలను తీసుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆరోగ్యం కోసం ఎంతగానో ఖర్చు చేస్తామని, వ్యాయమం ఎవరూ చేయడం లేదని తెలిపారు. ప్రస్తుతం జీవితంలో వ్యాయమం చేయాలని ఉన్నా.. చేసే సమయం దొరకకపోవడంతో చాలా మంది అనారోగ్య పాలవుతున్నారని చెప్పారు. అధిక బరువులతో గుండె జబ్బులు వచ్చే అవకాశాలున్నాయని కావున ప్రతీ ఒక్కరు వ్యాయమం చేయాలని వివరించారు. గ్రామాభివృద్ధికి తన వంతు సాయం చేస్తానని తిరుపతిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్ అసోషియేషన్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేటలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

# అనంతసాగర్‌లో సరస్వతి హోమం



అనంతసార్ గ్రామంలో సరస్వతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని అనంతసాగర్ గ్రామంలో ఆదివారం సరస్వతి హోమం నిర్వహించారు. సరస్వతి సేవా సమితి సభ్యులు రమేశ్, సంతోష్ ఆధ్వర్యంలో సరస్వతి ఉపాసకుడు విద్యామనోహర శర్మ పాల్గొని హోమం చేశారు. ఈ సందర్భంగా మనోహరశర్మ మాట్లాడుతూ... మంచిచేసే వారిని ప్రోత్సాహించడం వల్ల అందులో ఫలితం లభిస్తుందన్నారు. ధర్మాన్ని కాపాడటం కోసం మనం పని చేస్తే, అదే ధర్మం మనల్ని కాపాడుతుందన్నారు. ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సరస్వతి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



సికింద్లాపూర్‌లో కొలువైన లక్ష్మీనర్సింహస్వామి



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

**సికింద్లాపూర్‌లో..**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొనేరు పక్కనున్న, గుట్టపైన వెలసిన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్, ఆలయ ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.